Andhra Jyoti Date:17.01.2015

# గ్యాస్ కష్టాలకు త్వరలో చెల్లు!

- గెయిల్, షెల్, జీడీఎఫ్ స్యూయజ్‌లతో ఏపీజీడీసీ ఎంవోయూ
- అదనంగా 2000 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- రాష్ట్ర ఖజానాకు ఏటా 1700 కోట్ల ఆదాయం
- చంద్రబాబు సమక్షంలో అవగాహనా ఒప్పందాలు

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)



కేంద్రమంత్రి గడ్కరీని సన్మానిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో సహజ వాయువు కష్టాలకు త్వరలోనే కాలం చెల్లనుంది! ఎంతో కాలంగా ఎదురు చూస్తోన్న లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) టెర్మినల్‌ను కాకినాడలో నిర్మించేందుకు ఒప్పందం కుదిరింది. దీంతో... గ్యాస్ కొరత కారణంగా దశాబ్దకాలనికి పైగా ఎలాంటి విద్యుదుత్పత్తి లేకుండా నిర్ద్రాణంగా పడిఉన్న గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి ప్లాంట్లకు నిర్విరామంగా సహజ వాయువు సరఫరా కావడంతోపాటు... మరికొన్ని పరిశ్రమలకు ముడి సరుకు కూడా లభిస్తుంది. పైగా... రాష్ట్రంలో అదనంగా 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగేందుకు ఆస్కారం ఉంది. ఇదే సమయంలో రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో ఏటా రూ.1700 కోట్ల రాబడి వస్తుంది... దాదాపు 2,000 మందికి ఉపాధి లభిస్తుంది. అంతేకాదూ... ఈ ప్రాజెక్టు వల్ల గ్యాస్ రవాణా చార్జీలు తగ్గి, అందుబాటు ధరల్లో సహజ వాయువు లభిస్తుంది.

రాష్ట్ర ప్రగతిలో కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ కీలక భూమిక పోషించనున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి వై.సుజనాచౌదరిల సమక్షంలో గురువారం ఢిల్లీలో జీడీఎఫ్ స్యూయజ్, షెల్, గెయిల్‌లతో ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీజీడీసీ) కాకినాడలో ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఏర్పాటు చేసేందుకు విడివిడిగా రెండు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంది. గెయిల్, జీడీఎఫ్ స్యూయజ్, షెల్ కంపెనీలతో... శుద్ధి చేసిన ఎల్ఎన్‌జీని మార్కెట్ చేయడం కోసం మొదటి ఒప్పందాన్ని ఏపీజీడీసీ కుదుర్చుకుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, గెయిల్‌లకు 48 శాతం, జీడీఎఫ్ స్యూయజ్, షెల్‌లకు చెరి 26 శాతం చొప్పున ఈక్విటీలు ఉంటాయి.

కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ఫ్లోటింగ్ స్టోరేజీ అండ్ రీగేసిఫికేషన్ యూనిట్ (ఎఫ్ఎస్ఆర్‌యు) పూర్తి సామర్థ్యం ఏటా 5 మిలియన్ టన్నులు ఉంటుంది. దీనిని భవిష్యత్‌లో రెండింతలు చేస్తారు. దేశంలోనే తొలిసారిగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో కాకినాడ ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ టెర్మినల్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టును 18 నెలల్లోనూ పూర్తి చేయాలన్న లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించే ఇలాంటి ప్రాజెక్టుల వల్ల భవిష్యత్‌లో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో నేరుగా సముద్రంలోనే పైప్‌లైన ద్వారా గ్యాస్ రవాణా కావడం వల వాతావరణ కాలుష్యానికి ఆస్కారం ఉండదని, అదే విధంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ నిరాటంకంగా గ్యాస్ సరఫరా జరుగుతుందని అధికారులు వివరిస్తున్నారు.

## చంద్రబాబుతో భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబుతో షెల్, గెయిల్, జీడీఎఫ్ స్యూయజ్ ప్రతినిధులు గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో నిర్మించే ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ టెర్మినల్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఈ కంపెనీలకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకరించాలని ఇంధన, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన కార్యదర్శి అజయ్ జైన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. కాగా, రాయల్ డచ్ షెల్ కంపెనీకి ఎల్ఎన్‌జీ టెర్మినల్‌లో 26 శాతం వాటా ఇచ్చేందుకు ఏపీ సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను ఏపీ సర్కార్ ప్రోత్సహిస్తుంది.

## 301 కిలోమీటర్ల పైప్‌లైన్

కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకూ 301 కిలో మీటర్ల పొడవున లే, బిల్డ్, ఆపరేట్, ఎక్స్‌పాండ్ విధానంలో గ్యాస్ పైప్ లైన్ వేసేందుకు మెసర్స్ పీఎన్‌జీఆర్‌బీకి ఏపీజీడీసీ అనుమతులు ఇచ్చింది. ఇప్పటికే ఈ సంస్థ పైప్‌లైన్ల నిర్మాణంపై దృష్టి సారించి పనులు చేపడుతోంది. అదే విధంగా విజయవాడ నుంచి నెల్లూరు వరకూ గ్యాస్ పైప్ లైన్ వేసేందుకు ఏపీజీడీసీ కార్యాచరణ సిద్ధం చేసింది. తుంకూరు నుంచి నెల్లూరు వరకూ గ్యాస్ లైన్ వేస్తే... రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ గ్యాస్ పైప్ లైన్ వేసినట్లు అవుతుందని ఏపీజీడీసీ పేర్కొంటోంది.

## రాష్ట్రాభివృద్ధిలో కీలక మలుపు: చంద్రబాబు

కాకినాడలో నిర్మించే ఎల్ఎన్‌జీ టెర్మినల్ రాష్ట్రాభివృద్ధిలో కీలక మలుపుగా మారుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశ, రాష్ట్ర ప్రగతిలో విద్యుత్తు ప్రధాన పాత్రను పోషిస్తుందని, ఎల్ఎన్‌జీ టెర్మినల్ వల్ల రాష్ట్రంలో అదనంగా రెండు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవకాశం లభిస్తుందని వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో ఇలాంటి ఒప్పందాలు ఏర్పరుచుకోవడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, 18 నెలల్లోనే ప్రాజెక్టు పూర్తి కావడం వంటి చర్యలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంత వేగవంతంగా పనిచేస్తుందో స్పష్టమవుతోందని చంద్రబాబు అన్నారు.